## క్లుప్తంగా

### పార్టీ పదవి ఇవ్వాలని వినతి



పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లాకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని ఆదిబట్లకు చెందిన ఎరుకల చంద్రశేఖర్‌గౌడ్‌కు ఇవ్వాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఆ పార్టీ నేతలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు రాపోల్ జయప్రకాశ్‌నారాయణ, ఎరుకల దేవగౌడ్, సుదర్శన్‌రెడ్డి, మధుసూదన్‌గౌడ్, మధుకర్‌గౌడ్‌లు మాట్లాడుతూ.. 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్న శేఖర్‌గౌడ్ అన్నివిధాలా డీసీసీ అధ్యక్ష పదవికి అర్హుడని పేర్కొన్నారు.

### ఘనంగా లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రానికి సమీపంలో వెలసిన శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా స్వామివారి కల్యాణోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. మంగళవారం గణపతిపూజ, పుణ్యహావాచనం, విశేష అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ దంపతుల ఆధ్వర్యంలో కల్యాణ క్రతువు జరిపించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సీఎల్.శ్రీనివాస్ యాదవ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, మాజీ సర్పంచ్ లలితజోతయ్య, నాయకులు అఖిల్, అనిల్, బుచ్చిబాబు, శేఖర్, దశరథం, సజ్జుపాషా, రవికుమార్, జగతయ్య, వెంకటేశ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

### బాల్యమిత్రుడికి చేయూత

ఆమనగల్లు: అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న స్నేహితుడికి బాల్యమిత్రులు తోడ్పాటునందించారు. అధైర్య పడొద్దని అండగా నిలిచారు. మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఆయన బాల్యమిత్రులు మంగళవారం పరామర్శించారు. అనంతరం చికిత్స నిమిత్తం రూ.20 వేల నగదు అందించారు. కార్యక్రమంలో ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదీలాల్, బాల్యమిత్రులు రఘు, రాములు, నిరంజన్, చంద్రమౌళి, రాములు పాల్గొన్నారు.

### సూర్యగిరి ఎల్లమ్మకు పూజలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులకు కొంగు బంగారంలా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైనరోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈట మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### మాజీ కార్పొరేటర్‌కు దళితరత్న అవార్డు

మీర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం అందించే దళితరత్న బిరుదును మీర్‌పేట కార్పొరేషన్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం రాష్ట్ర చైర్మన్ ఇటిక రాజు చేతుల మీదుగా అవార్డును స్వీకరించానని తెలిపారు. తన సేవలను గుర్తించి అవార్డును అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళిత సంక్షేమ సమితి మీర్‌పేట అధ్యక్షుడు బైగళ్ల ఓంప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

### వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని మత్స్యావతార వేంకటేశ్వరస్వామి దేవాలయ హుండీని మంగళవారం లెక్కించారు. గత 55రోజులకు గాను హుండీ ఆదాయం రూ.1 లక్షా 14 వేల 300లు వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాజేందర్‌రెడ్డి, మాజీ ధర్మకర్తలు యాదగిరి ముదిరాజ్, జ్ఞానేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

# కంకర పరిచి.. కష్టాలు మిగిల్చి

- నత్తనడకన బీటీ రోడ్డు నిర్మాణ పనులు
- ప్రారంభించి రెండేళ్లు దాటినా పూర్తికాని వైనం
- తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్న వాహనదారులు



కంకర పోసి వదిలేసిన కర్కల్‌పహాడ్-చల్లంపల్లి రహదారి



కడ్తాల్-గుర్లకుంట రోడ్డు దుస్థితి

కడ్తాల్: నత్తనడకన సాగుతున్న రోడ్డు నిర్మాణ పనులతో మండలవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై కర్కల్‌పహాడ్ గ్రామం నుంచి చల్లంపల్లి వరకు నార్లకుంటతండా, వెలుగురాళ్లతండా మీదుగా సుమారు 5.5 కిలోమీటర్ల నిడివిగల మట్టి రోడ్డును బీటీగా మార్చాలని గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందుకు ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.3.30 కోట్ల నిధులు మంజూరు చేశారు. 2023 జూలైలో అప్పటి ప్రజా ప్రతినిధులు పనులను సైతం ప్రారంభించారు. 2024లో సదరు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి, సుమారు 5 కిలోమీటర్ల రోడ్డుపై కంకర పోసి వదిలేశారు. దీంతో ఏడాదిగా కంకర రోడ్డుపై ప్రయాణం సాగించలేక ఆయా తండాల, గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**బీటీ వేయండి మహాప్రభో!**

కర్కల్‌పహాడ్-చల్లంపల్లి, కడ్తాల్-గుర్లకుంట తండాల మధ్య బీటీ రహదారి ఏర్పాటు చేస్తే మండల కేంద్రంతో పాటు, హైదరాబాద్‌కు రాకపోకలు సాగించేందుకు ఇక్కట్లు తొలగుతాయని ఆయా తండాల, గ్రామాలవాసులు పేర్కొంటున్నారు. ఆయా రహదారుల పనులు త్వరగా పూర్తి చేయాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే కానీ పనులు ముందుకు సాగడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇలాగే ఉంటే రాకపోకలకు ఇబ్బందులు తప్పవని, ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు గిరిజనుల ఆవేదనను అర్థం చేసుకోవాలని బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### నిధుల లేమితో ఇబ్బంది

కడ్తాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని గుర్లకుంట తండా రహదారి నిర్మాణ పనులు ప్రారంభించి రెండేళ్లు దాటినా పూర్తి కాలేదు. తండావాసుల ఇబ్బందులను గుర్తించిన అప్పటి ప్రభుత్వం 2022లో కడ్తాల్ నుంచి గుర్లకుంటతండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి సీఆర్ఆర్ కింద రూ.కోటి నిధులు మంజూరు చేసింది. 2023లో అప్పటి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. పనులు ప్రారంభించిన గుత్తేదారు తండాకు వెళ్లే నిర్మాణ పనులను నత్తనడకన సాగిస్తున్నాడు. దీనికి నిధులలేమి ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా తండావాసులకు మాత్రం ఇక్కట్లు తప్పడం లేదు.

### నిత్యం ప్రమాదాలు



కర్కల్‌పహాడ్-చల్లంపల్లి రహదారిపై కంకర వేసి వదిలేయడంతో రాత్రివేళ ప్రయాణించాలంటే దడ పుడుతోంది. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బైక్‌పై బయటికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నాం.

– తులసీరాంనాయక్, వెలుగురాళ్లతండా, కడ్తాల్

### సమస్యను పరిష్కరించండి



రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి, తండావాసుల ప్రయాణ కష్టాలు తీర్చాలి. సమస్యను అధికారులతో పాటు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చినా పరిష్కారానికి నోచుకోలేదు. పనులు ప్రారంభించి రెండేళ్లు దాటింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలి.

– రాంచందర్‌నాయక్, గుర్లకుంటతండా, కడ్తాల్

# విద్యాభివృద్ధికి ప్రత్యేక చొరవ

- వసతి గృహానికి నూతన భవనం నిర్మిస్తాం
- ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డి



బీసీ వసతి గృహం భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలో శిథిలావస్థలో ఉన్న బీసీ బాలుర వసతిగృహం స్థానంలో నూతన భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మాడ్గుల రోడ్డులో ఆరేళ్లుగా నిరుపయోగంగా ఉన్న వసతిగృహం భవనాన్ని మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులతో కలిసి వారు పరిశీలించారు. విద్యార్థులు లేకపోవడంతో వసతి గృహాన్ని ఎత్తివేయడంతో భవనం వృథాగా ఉండి శిథిలావస్థకు చేరింది. దీంతో నూతనంగా భవనం నిర్మించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక నాయకులు ఎంపీ, ఎమ్మెల్యేలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆమనగల్లు పట్టణాన్ని విద్యారంగంలో మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. బీసీ వసతిగృహం స్థానంలో నూతన భవనం నిర్మిస్తామన్నారు. వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కేశవరామ్‌ను కోరారు. కార్యక్రమంలో పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, తహసీల్దార్ లలిత, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, నాయకులు మధుసూదన్‌రెడ్డి, మండ్లి రాములు, మానయ్య, మెకానిక్‌బాబా, శ్రీనునాయక్, ఫరీద్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాటగీత



రైతులకు భోజనం వడ్డిస్తున్న చైర్‌పర్సన్ గీత

ఆమనగల్లు: ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాటగీత సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ధాన్యానికి మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. సన్న ధాన్యం విక్రయించే రైతులకు క్వింటాల్‌కు అదనంగా రూ.500 అందిస్తున్నట్లు వివరించారు. కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకువచ్చే రైతులకు ఇబ్బందులు కలుగకుండా అదనంగా కాంటాలు, హమాలీలను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. అనంతరం రైతుల కోసం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు జగన్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు మహేశ్, గౌస్, విజేందర్, మార్కెట్‌కమిటీ సిబ్బంది కిరణ్, రాములు, శరత్, వినోద్ తదితరులు ఉన్నారు.

# కఠోర సాధనతోనే విజయం



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఇబ్రహీంపట్నం: మెదడుకు పదును పెడితేనే మేధో సంపత్తి వృద్ధి చెందుతుందని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం పల్లె ఆణిముత్యాలు పేరుతో జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినోభానగర్ సాధన కుటీర్‌లో నిర్వహించిన 60 రోజుల(సెలవు దినాల్లో) శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల లక్ష్య సాధనకు నిరంతర ప్రయత్నం ఎంతో ముఖ్యమన్నారు. అలాంటి వారికి సాధన కుటీర్ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఏ పనైనా ప్రారంభించే ముందు కష్టంగా అనిపించినా.. కఠోర సాధనతో విజయం సాధించవచ్చునన్నారు. సుడోకో లాంటి పజిల్స్ ఆడితే ఆలోచన శక్తి మెరుగుపడుతుందని చెప్పారు. జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ నిర్వాహకుడు సదా వెంకట్ నిస్వార్థంగా ప్రభుత్వ బడుల్లో చదివే పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కాగా ఆయా రంగాల్లో ప్రతిభ చూపించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జీఎస్ఎఫ్ ఫౌండర్ సదా వెంకట్, విశ్రాంత ఎంఈఓ శ్రీనివాస్, వాలీబాల్ మాజీ క్రీడాకారుడు సుధాకర్‌రెడ్డి, సాద్రి ఇన్‌చార్జి ప్రమోద, విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



యాచారంలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

యాచారం: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా మంగళవారం యాచారంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్ ఆధ్వర్యంలో గునుగల్ క్రీడా క్షేత్రంలో పని చేస్తున్న కార్మికులతో పాటు, ఇతర పరిశ్రమల్లో పని చేస్తున్న శ్రమజీవులతో కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చందునాయక్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ప్రమాదకర లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వ తీరు కార్మికుల మనుగడకే ప్రమాదంగా మారిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మయ్య, అండాలు, బోడ కృష్ణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

**సమ్మెను జయప్రదం చేయండి**



కడ్తాల్: మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కడ్తాల్: అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జూలై 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాంమోహన్‌రావు, ఆమనగల్లు ఏరియా కమిటీ కన్వీనర్ జిల్లెల పెంటయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. దేశంలో ఉన్నటువంటి యుద్ధ వాతావరణం దృష్ట్యా ఈ నెల 20న జరగాల్సిన సార్వత్రిక సమ్మె, వచ్చే నెల 9కి వాయిదా పడిందని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, కార్మికుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్మిక లోకం సమస్యలపై జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు మల్లేశ్, హమాలీ సంఘం అధ్యక్షుడు రమేశ్, గ్రామ పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షుడు కుమార్, నాయకులు శ్రీను, అభిజిత్, శేఖర్‌గౌడ్, భాను, కృష్ణయ్య, వెంకటేశ్, జంగయ్య, రాములు, రమేశ్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల అందజేత

ఇబ్రహీంపట్నం: స్థానిక ప్రజాభవన్‌లో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఇబ్రహీంపట్నం మండలం, మున్సిపాలిటీల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను(ప్రొసీడింగ్స్) ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అందజేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ యెల్లంకి జంగయ్యగౌడ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్‌లు వేర్వేరూ ప్రకటనల్లో తెలిపారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, మండల పరిధిల్లో మొదటి విడతగా 872 మందికి మంజూరైనట్లు చెప్పారు. సకాలంలో లబ్ధిదారులు స్థానిక ప్రజాభవన్‌కు హాజరై మంజూరు పత్రాలను తీసుకోవాలని కోరారు.

### నేడు ఎమ్మెల్యే పర్యటన

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాధారం గ్రామంలో బుధవారం ఉదయం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీక్యానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేయడంతో పాటు, ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత



లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేస్తున్న నేతలు

కడ్తాల్: మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామ పంచాయతీలో 15 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి పంచాయతీ కార్యదర్శి సందీప్ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు చల్లా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అశోక్, మాజీ సర్పంచ్ నరేందర్, నాయకులు రమేశ్‌గౌడ్, రమేశ్, లింగం, మహేశ్, కృష్ణయ్యగౌడ్, జంగయ్యగౌడ్ పాల్గొన్నారు.

# అన్ని వర్గాలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల: బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో మంచాల మండలానికి చెందిన నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు కలిశారు. ఈ మేరకు తమ సంఘానికి కమ్యూనిటీ భవనం ఏర్పాటుకు కృషి చేయలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే బలహీన వర్గాలకు చేయూతను ఇచ్చే పార్టీ అన్నారు. తమ ప్రభుత్వం హయాంలోనే వెనుకబడిన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. ఆనాడు దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి, నేడు రేవంత్‌రెడ్డి పేదవర్గాల ప్రజలకు వెన్నుదున్నుగా నిలుస్తున్నారన్నారు. నియోజకవర్గంలోనే పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. ప్రతి పేదవాడికి ఆపన్న హస్తం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు రమాకాంత్‌రెడ్డి, జంగయ్య, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేష్, రాజు, వెంకటేశ్వరరెడ్డి, నాయీబ్రాహ్మణ సంఘం నేతలు బాలరాజు, వెంకటేష్, సురేష్, నర్సింహ, మల్లయ్య, సత్యనారాయణ, రమేష్, జగన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రంగారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

# ప్రహరీలు లేక.. జీవాల సంచారం

- రాత్రివేళ మందుబాబులకు అడ్డాగా ప్రభుత్వ బడులు
- చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయుల డిమాండ్



కడ్తాల్‌లో ప్రహరీ లేని బాలుర ఉన్నత పాఠశాల



పాఠశాల మైదానంలో మూగ జీవాల సంచారం (ఫైల్)

కడ్తాల్: ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలతో పాటు, మండల పరిధిలోని అనేక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీలు లేవు. ప్రధానంగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ప్రహరీ లేకపోవడంతో రక్షణ కరువైంది. చీకటి పడితే చాలు తాగుబోతులు, మూగజీవాలకు నిలయంగా మారుతుంది. దీంతో పాటు మండలంలోని అనేక ప్రభుత్వ పాఠశాలలో ప్రహరీలు నిర్మించకపోవడం, నైట్‌వాచ్‌మెన్లు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారుతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళలో పాఠశాలల మైదానంలో మద్యం తాగి ఖాళీ సీసాలు, వ్యర్థపదార్థాలు అక్కడే వదిలేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు విద్యార్థులు, ఉపాధ్యాయులు స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు కరువయ్యాయి.

**సీసీ కెమెరాల ధ్వంసం**

మండలంలో ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత, డీఎన్‌టీ, ఆశ్రమ పాఠశాలలున్నాయి. వీటిలో కొన్నింటికి మాత్రమే ప్రహరీల నిర్మాణం చేపట్టారు. మిగతా వాటికి లేవు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పాఠశాలలో కంప్యూటర్‌లు, ఇతర విలువైన సామగ్రి సమకూర్చినా రాత్రి వేళలో రక్షణ లేకుండా పోయింది. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన కూడా గుర్తు తెలియని వ్యక్తులు తరచూ ధ్వంసం చేస్తున్నారు. దీంతో పాటు మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలలకు నేటికి రక్షణ గోడలు లేవు. ప్రభుత్వం ప్రత్యేకంగా పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణంపై దృష్టి సారించాలని ఆయా గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ విద్యా సంవత్సరం ఉన్నత అధికారులు చర్యలు తీసుకుని పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్, ప్రహరీల నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### ప్రహరీలు నిర్మించాలి



పాఠశాలలకు ప్రహరీలు లేక మూగ జీవాలు సంచరిస్తూ విద్యార్థులకు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వాటి సంచారంతో పాఠశాల పరిసరాలు దుర్గంధ భరితమవుతున్నాయి. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే పాఠశాలలకు ప్రహరీల నిర్మాణం చేపట్టాలి.

– భగీరథ్, బీజేవైఎం నేత, కడ్తాల్

### ఉన్నతాధికారులకు నివేదిస్తా



పాఠశాలకు ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా రాత్రి వేళలో వాటిని కూడా, గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తున్నారు. ప్రహరీ నిర్మాణ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– జంగయ్య, హెచ్ఎం, బాలుర ఉన్నత పాఠశాల, కడ్తాల్